# వెఁమ్మై కత

దినాము నేను సాళ్లెనుండి వొచ్చె ట్యాళ్ళకె కిషన్‌సింగు దుకాణపు మూలమలుపు సందుకాడ "అమ్మణ్ణి" అను కుంట అమర్‌సింగ్ ఎదురైతుండె అమరుసింగు పొలపెర కండ్ల వడంగనె నా కెందుకో ఎక్కడలేని బుగు లయ్యేది. ఏబూళోణ్ణి ద్యావరోణ్ణి జూసినా నా కంత బుగులు గాదు గని కాకినెక్కరు. ఎఱ్ఱపట్టెలఅంగి దొడుక్కున్న అమరుసింగు అంటె కండ్లల్ల కన్కడవొడి ఏసి నంత పని అయ్యేది. కిషన్‌సింగు దుకాణముల లక్కపావులు గుగ్గులు, సీనిబొమ్మలు, గాజుగొట్టాలు, డాంకురేకులు, బింగణ్ణరెక్కలు, రంగు కాయితాలు, చిల్కలు, బెండ్లు బత్తీసలు, లేవుడీలు, పిప్పరమెట్లు అమ్ముతడు. అందుకోసం పిల్ల లందరు ఆడ మూగుతరు. ఊళ్లెకు యాగం గెద్దులో డొచ్చినా, పాము లోళ్ళొచ్చినా, కోతితిమ్మన్నను దోల్కొని దొమ్మ రోడొచ్చినా, ఆడ్నె ఆటకు వెడ్తరు. ఇగ బుజ బుజ మనుకుంట పిల్లలందరు ఆడ మూగుతుండ్రి. నేను పిల్ల లల్ల గలిసి అతమాస జూస్కుంట నిల వడ్తుంటి గని వాణ్ణి కండ్లల్ల యాడ వడ్తనో అని నా కంటె పొడ్గున్న పిల్లల సాటుకు వోయి ఆకుమరుగు పిందోలె నిలవడ్తుంటి. ఉస్కె వోస్తె ఉస్కె రాలని గుంపుల నన్ను వా డెట్ల గుర్తు పడ్తుండెనో? ఏమో గని వాడు నన్ను జూడంగనె యాణ్ణుంచో బిర బిర నడ్సుకుం బొచ్చి, దుకాణం కాడ నిలవడి అమ్మణ్ణీ, అమ్మణ్ణీ అని మాతలు వెట్టుకుంట "ఇగో రా! పూలు! గులాబ్‌పూలు" అని పిలుస్తుండె, ఆ రంతు యిని, నా కింకా బుగులు పుచ్చుకొనేది. ఆ బుగుల్తోటి ఎన్కా ముందు జూడకుండ ఎవరో దరుము కొచ్చినట్లు ఉర్కి ఉర్కి పోయి ఇంట్ల జొరవడ్తుంటి.

అమ్మో! వీ డెవడో? నిజంగనే మైదులోడు. మాయలోడు ఇన్నాళ్లు ఉత్తుత్తోడు అనుకున్న. నేను గోయిందమ్మ ఇంట్ల కెల్లి గుల్ మాసి పూలు దెచ్చుకోంగ జూసిం దేమొ నాకు పూలిస్త నని ఆశ వెడ్తుండడు. పూ లాశకు నేను దగ్గరికి పోంగనె మైదు జల్లి, మైస్మారం జేసి నన్నెత్తు కోనిపోయి మొమ్మయి జేయా అని జూస్తుండడు మొన్ననే నా జతకాడు ఇంద్రమ్మ చెప్పింది గద ఊళ్ళకు ఎవరో పిల్లగాండ్ల ఎత్తుకి పోయె టోళ్ళొచ్చిరంట వాళ్ళు యా డంటె ఆడ మనండ్ల గల్సినట్టె నిలవడి పిల్లలకు మిఠాయి లిస్తము, బొమ్మ లిస్తం. కైలాసం జూపిస్తం అని దగ్గెరికి పిల్సి ఎత్తుకపోతుండరంట; అందు కోసమే "ఎవరా యోళ్ళు పుట్నాలు పెడ్త మన్నా, బెల్లంబెడ్త మన్నా ఆ సొరిసెకే పోకుండి అని వాళ్ళమ్మ నాంచారమ్మ జెప్పిందంట."

నిజంగ నా జతపిల్ల చెప్పినట్లు పిల్లల్ని ఎత్తుకపోయె తంతులోడె. ఈ బుడు బుడుక్కలోనికి నే నే దొరికినాను! అందరికంటె నేను ముద్దుగున్ననని నన్ను ముందు ఎత్తుక పోవాలె అని అనుకుంటున్నడు అందరికంటె నేను జర లావున్నగద మరి నన్నెత్తుక పోయి నూనె లేస్తె మొమ్మె ఎక్కువ వొస్త దని అనుకున్న డీ కొన్నీగాడు అందుకోసమె నన్ను జూడంగనే అమ్మణ్ణీ గిమ్మణ్ణీ అనుకుంట ఎంతో ప్రాణవార్తికం ఉన్నట్లు పిలుస్తడు. నా మిటికిళ్ళన్ని ఇరుస్త. ఈ ముచ్చట ఇయ్యాళ్ళ మా ఇంట్ల జెప్పాలె. అవును! ఎవరికి? జెప్పాలె? ఎట్ల జెప్పాలె? మరి మా నాయిన లేడుగద! మా నాయి నుంటె వీణ్ణి కత్తికో తున్కజేసి రక్తం కండ్ల జూడక పోయిండా? మరి నాకు మా నాయన యాడుండడు?

నన్ను సాకే టోళ్ళేమి కలిగినోళ్లా? అంతంతోళ్లే గదా! ఇగ ఈ మొమ్మెజేసె టోళ్ళేమో బండాళం బాగ ఉన్నోళ్ళు ఉంటరంట.

ఆ ముల్లె మూట బిఱ్ఱుజూసుకొని తీరు తీరు మాయవిశాలు ఏసుకొని ఊళ్ళవోంటి తిరుక్కుంట పిల్లలను వట్కపోత రంట. ఏ మన్న గని మా ముసలమ్మ రుక్కుణమ్మ కన్న జెప్త; చెప్తె మట్కు మా ముసలమ్మ వాణ్ణెం జేస్తది. ముందే పిరికి ముసలమ్మ ఈ సంగతి తెల్సె ట్యాళ్ళకు "వాయవ్వో ! పుట్టిమున్గె కాలమే వచ్చె గదవ్వా ! మొమ్మైజేసె టోళ్ళు ఊళ్ళ్య జొరవడ్డ రంట. ఎత్తెత్తు మాణిక్యం తీర్గ సాక్కుంటున్న ఈ మొల్కను. ఆ సదు వొద్దు ఆ సాళ్ళె వొద్దు. దినాలు సెప్పి సెప్పి రావు. ప్రాణం కన్నె ఎక్కువనా ? సదువు గిదువు ! పాపిష్ఠి మెకంగాల పిల్ల బెదుర్ల జిక్కి వొత్తి వొత్తి అయింది. ఈ కడ్పదాటి అడ్గు బయట వెట్టకు తల్లీ ! ఎచ్చమ్మ అని నన్ను సాల్లె మాన్పిచ్చి ఇంట్లనే ఉండమంటది.

మళ్ళ నేను సదువుమాని ఇంట్ల ఎట్లుండాలె ? నేను నాల్గోతరగతికి పెచ్చను గదా ! మా పిల్లలు ముందే తులువపిల్లలు. బంకుల్ల గూసోని కచ్చకాయ లాడుకుంట పెద్దలొల్లి జేస్తరు. నేను వోకుంటె ఇంద్రమ్మ శరణమ్మ, కోమటియశోద, జాంద్రఎల్లమ్మ, బలిజెరాచమ్మ, వీళ్ళందర్ని తీనె ల్దీసి వర్సగ ఎవరు కూసోవెడ్తరు ? శాబాదు సత్తెమ్మ చాకుపీసుల దొంగతనం జేస్తె బింగి శ్లెవరు దీపిస్తరు ? పుల్లారెడ్డి సత్తెమ్మ ముందే బడిదొంగది. అది ఆయింత ఎగవెడ్తే పెద్ద పంతులమ్మకు ఎవరు జెప్తరు ? దాన్ని గుంజకొచ్చేటందుకు కాజిమా నెవరు దోల్తరు ?

అమ్మో ! మర్శిపోయిన రేపు నాదర్‌సావు మా బడికి మోయినా కోసం వొస్తడంట నేను గిన లేకుంటే తెలుగుబడికి పేరే లే దని మా పెద్దపంతులమ్మ మెచ్చుకోని పొద్దున ప్రార్థ నప్పుడు చెప్పిందంట. ఎందుకంటె మొన్న నాదర్‌సాబ్ వొచ్చినప్పుడు మా మూడోతర్గతి

తెల్గుపుస్తకాలు మా దగ్గరలేవు పంతులంగారి చేతులపుస్తకం దీసి వొచ్చినఅవుపాఠం సదువు మన్నడు. ఇంగ పిల్లలు ఎడ్డెమొకం బెట్టి ఎక్కిళ్ళువడ్డట్లు నత్తివోయినట్లు నంగి నంగి వల్కిండ్రు. ఆ సదువుడు ఇన్న ఆ తుర్కాయిన మొకం చిట్లుచ్చుకోని ఈ దిక్కుమళ్ళి నన్నుజూసి "తుం పడో!" అనే ట్యాళ్ళకు నేను "అవుపై ఈగలు, దోమలు చీమలు, నల్లులు, బల్లులు పారిసచో తోకతో ఊపుకొనును" అని అలుగు దుంకినట్లు నోటికి చదివే ట్యాళ్ళకు అయన "సెబాష్ బేటీ! జీతేరహో" అని నా ఈపుమీద గొట్టి బిస్కోట్ల పొట్లం ఇచ్చిండు. అయిన పోయింక మా పంతులమ్మ నా చెవులువిండి "పుస్తకంల లేని చీమలు, నల్లులు, బల్లులు యాడికెళ్ళి దెచ్చిన" వని అడిగింది. నేను బిస్కోట్ల డబ్బ గట్టిగ పట్టుకొని ఏడుస్తుంటె పెద్దపంతులమ్మ వొచ్చి "సూడుండి పిల్ల! అంటె ఇట్లుండాలె మా బడికి పేరొచ్చొంది", అన్నది. అడ్డగోడెక్కి చిలుమన్ పర్దాల సాటుకెల్లి తుర్కపంతులమ్మలు గూడ నన్ను జూసిండ్రు. మళ్ళా గట్ల తుర్కపాఠం అడ్గితె ఎట్లా?

ఎట్లైన నేను సాళ్లె మానగూడదు. ఆంజనేలూ తండ్రి నేను సాళ్లెమానకుండ, వాణ్కి దొర్కకుండ ఉండాలె. ఒగయాళ్ల నేనుగిన ఆ దొంగోణ్కి దొర్కితి నంటె మొమ్మై ముద్ద అయిత గద, నన్ను నూనె లేస్తె నా కెంత మంట లేస్తదో ఏమొ? ఎట్ల జేతబ్బా! ఈ పాడు మొమ్మైని దేవుడు ఎందుకు పుట్టించిందో? ఏమో?

ఈ మొమ్మై తోటె ముత్యాలు జేస్తరంట ఇంగ అట్ల జేసిన మొమ్మై ముత్తాలన్ని ముత్యాల నాగప్ప కొనుక్కొచ్చి చిన్నవి పెద్దవి ఏరి తూట్లు గుచ్చి పేర్లు పేర్లు పట్టుదారాలకు గుచ్చి కొనాకు జలతారు కుచ్చులు గట్టి ఊళ్లెకు దేస్తడంట నన్ను మొమ్మై జేస్తె పుట్కెడు ముత్యాలు అయిత. పాపం! నా దోస్తులంత ప్యాదోళ్ళు వాళ్ళు యాడ ముత్యాలదండలు గొనుక్కుంటరు! గని అదొక్కటె

బండాల మున్నది - పుల్లారెడ్డిబిడ్డ మొద్దుసత్తి ముక్కిడిముక్కిడి సుప్పనాతి, శూర్పనక్క వాళ్ళయ్య ఏం దంటే అది కొనియిస్తడు ఇగ అదే నన్ను దండేసుకుంటది. ఛూ పోయి, పోయి నేను దానిమెళ్ళ ఊఁ అంటె ఆఁ రాని కువ్వారందాని మెళ్ల వత్తనా? అనుకున్నదేమొ అమ్మగారు నేను ముత్యాలైతె ఏసుకుంట నని; మొన్న పంత్లంగారు నా చేతికి బగ్గెఇచ్చి నప్పటినుంచి నా మీద కచ్చె వట్టింది! అమ్మో! నేను సచ్చినా మొమ్మైగాను.

ఇంతసేపు బుగులువట్టి, బయానికి కండ్లు మూసుకున్న గద ఇప్పుడే దెరువ- నాకు సాళ్లె వద్దు గిళ్లె వద్దు- మొమ్మై అంటె మంటలేవ కుండ అయితనా? ఎందీ? చిక్మనంటు గోలినట్లు గోలాతె నంట అ పెనక తుమ్మసాదును రాసినట్లు రాస్త రంట. మొద లేమొ మొమ్మై జేసె టోళ్ళు పిల్లల్ని మప్పిచ్చి ఎంటపెట్టుకొని ఓ గుట్ట మీదికి జేర్తరంట. ఇంగ ఆడ గిసొంటి కుటిలవా జోళ్లె ఇంగ కొంతమంది జత్తై, పిల్లలకు ఇగో నెమిలిజూడు, అగో బుర్కపిట్ట జూడు. రామసిల్క జూడు, ఆడ బాయిగట్టుమీద చెట్టుతొట్టల పపిడికంటె జూడు, అని ఆయీ మాటలు జెప్పుకుంట ఉంట రంట ఇంగి గుట్టకింద సెట్ల సాటుగ పెద్ద బాండ్లీ లల్ల నూనెవోసి మరి గిచ్చుకుంట ఉంటరంట. పాపం పిల్లలు ఈ పిట్టను, ఆ చెట్టును జూసుకుంట మరిసి నట్లున్నప్పుడు బుడుక్కన ఆ నూనెల పడే టట్లు దొబ్బుత రంట ఆ మసిల్న నూనెల పడి పిల్లలు ఉగ్గు తీర్గ మైనం తీర్గ ముద్ద ముద్ద అయితరంట. అదే మొమ్మై అయిత దంట. అమ్మో, నేను మొమ్మై గాను. గిమ్మై గాను ఈ సారి మా యమ్మకు ఎట్లైనా జెప్త అని దగా దబా ఉరుక్కుంటొచ్చి, అమ్మా! అని కడ్పుల కాళ్ళు పెట్టి కండ్లు దెరిసేవరకు నా కండ్లు బైర్లు గమ్మె. నేను కింద పడ్డంత పనైంది.

నా ఎదురగ అమరుసింగు నా కంటె ముందే వచ్చి పూలు చేతుల పట్టుకొని నిలపడ్డడు. ఇంగ నా కేమి దెల్వలేదు. అమ్మా అని ఊరు ఇచ్చుక పోయె టట్లు క్యాక వెట్టిన నా గొంతు ఇని గాదెల కెల్లి బియ్యం దోడ్తున్న మాయమ్మ బిర బిర ఇవతలి కొచ్చి "ఏ మాయెనే? తేలా? పామే? పట్టపగ ట్యాళ్ళ సావుకూత వెట్టి, నిలువుగం ద్లేసి నిలపడ్డవు" అని పీదరిచ్చు కుంట గల గల లొల్లి జేసుకుం టొచ్చింది. ఇంతట్లనె మీది ప్రాణం మీదనే వోయి నట్లు "ఏంది రా అమ్మణ్ణీ? అని అనుకుంట అమరుసింగు నా దగ్గరికి వొచ్చి నన్ను ఎత్తు కోనికె జూస్తుండడు.

వాణ్ణి దప్పిచ్చి, నేను మా యమ్మను జూసి ఎన్నెలతారు తీర్గ ఎప్పుడువోయి సుట్టుకున్ననో? సుట్టుకున్న. అట్ల మా యమ్మను రొండు సేతుల అలుము కొని అమ్మా! వాడు మొమ్మయ్యాడు. నన్ను పట్టుక పోయెటోడు" అని అన్ననో లేదో "వా యబ్బో! ఇదేం అన్యాల ముర్లా ఎవణి కంట్ల అగ్గి వోసుకుంటుండడు కొడ్కా? బడ్వ మొకం గాల? ఇట్లు జూడు నాయినా అమరుసింగూ!" అని అంటుంటె మూసినకన్ను దెరిసి "అమ్మా వీడు వీ.......డు అమరుసింగా? నీ కెట్లెర్క నే? వీణ్ని జూసె నేను మొమ్మయ్యాడన్న దినాం నే నొచ్చె ట్యాళ్ళకు పూలు సేతుల వట్టుకొని "అమ్మణ్ణీ! అమ్మణ్ణీ? అని కూతలు వెట్టి పిలుస్తుంటె. నన్నెత్తుక పోయెటందుకు తంతులు వన్నిండు. అని బుగులువట్టి ఉర్కొచ్చిన" అని సెప్పె ట్యాళ్ళకు. అమరుసింగు అనూతం నన్ను జవురుకొని సంక లేస్కొని "వాయబ్బ ఎంత మాటంటివి రా! చిన్నమ్మణ్ణీ. బాంచోణ్ణి గంత. ఎర్కవట్ట లేదా? నాయన కాశిరెడ్డి పటేలు ఉన్నప్పుడు కింద దించితె మన్నంటుత దని బుజాన ఏస్కొని సాకిన్రా నిన్ను. అని. నా నెత్తిని

గోర్లగొట్టి జడల పూవు పెట్టిండు. అప్పుడు నేను బెదురు సూపులు ఇడ్సి సరిగ నిలవడ్డ.

నా బుగులు గిరంతు వోయి నిలవడ్డంక మా యమ్మ అమరుసింగును జూసి "ఏమి అమరుసింగూ? నీ సూపే బంగారం అయింది? ఇన్నాళ్లు యాడుంటివి? ఈ ఊళ్ళె యాడున్నవు? ఏం కత?" అని అడ్గె ట్యాళ్ళకు, అమరుసింగు ఏం లేదమ్మ మన పటేలయ్య కాలంజేసి నంక కాలుగాలిన పిల్లి తీర్గ ఊరూరు దిర్గి స్నినోక్క. యాడిక్క వోతె మటుక్క, నా ఎత కిత అడ్గెటోళ్లె వరు? మోటగొడ్తవా? గొర్కగొడ్తవా? బంతిదిర్గుతవా? గడెం దున్నుతవా? అని అంటరు ఆ అంబలి దాగి సంకటి దినాల్నంటె సచ్చి సర్గాన ఉన్న నా పెద్దలు కండ్ల వడ్తరనోక్క తల్లి. నా గీత సక్కగలేక. గింత సంకటం బడవడ్తి. యాదో ఆ తండ్రి సలువ తోటి. నా ల్గశరా లొచ్చినవిగన్క పల్లెకొంపలు ఇడ్సి. ఈపట్నవాసం బట్టి. వకీల్ నారన్‌రావ్ తాన. బాకీలు వసూలు జేసె టందుకు. గుదిర్న. నౌకర్లె బొక్క రెక్కలు ఇర్సి తిప్పలు వడాల్సింది లేదు గని, బుక్తం సరిగ్గ వెట్టడు. ఇంత మాడి సెక్క కాయితం రేకుల తీర్గ ఓ జొన్న రొట్టె. అంటుపులుసు వోస్తె. నాకు యా పేగులకు సరిపోత దమ్మా. యాదో సగం మాడిన గని. సలువబట్టలకు మర్గి యీ గాసం కుదిరిచ్చుకున్న. ఇంగ ఆయన బంకుల్ల మొన్న మత్త కుర్సీలు దులుప్తుంటె. పిల్లల నడ్మ గుమ్మడి పండు తీర్గ అమ్మణ్ణి గండ్ల వడ్డది. పిలిస్తె పల్కలేదు. పసిపిల్ల గుర్తువట్ట నట్లుండది. పూ లన్న ఇస్త నని. పూల్దెంపి తెచ్చె ట్యాళ్ళకు ఇంత పని జరిగింది. ఇంగా నయం, మీదోడు సల్లగ జూసిండు. లేక వోతె అదురుదెబ్బకు పై ఎచ్చవట్టినా కష్టముండె. అమ్మణ్ణి, నా తల్లి! చిల్కలదండ! పొయ్యొస్తరా" అని వోయిండు.

అప్పణ్ణుంచి ఎట్టపట్టెల అంగోృడు మొమ్మయ్యోడు గాడు. మా పాత గాసగాడు అమరుసిం గని నాకు సమ్మొకం గుదిరింది. ఇంగ దినాం అమరుసింగు నాకు ఉల్లింతపండ్లు కానెపూనెపండ్లు జిబ్రేగిపండ్లు తునికిపండ్లు ఊడ్గపండ్లు మొర్లిపండ్లు గిన్నెపండ్లు యావి దొర్కితె అవి దెచ్చి ఇస్తుండె. సేం ద్లల్ల కెల్లి మక్కకంకులు జొన్నకంకులు తయిదకాపిళ్లు మొల్కసద్దలు నూగ్గాయె పెసరుగాయె పెబ్బరుకాయె మిటికిళ్లు ఇవన్నిదెచ్చిస్తుండె. దినాం నేను నా జతగాళ్ళం అమరుసింగు కండ్లవడక పోతె. బర్గె దిబ్బలు దిన్నా సరె అని. వచ్చెదాక నిలవడి "అన్నా" అని పిల్సుకుంట తెచ్చినవి దులిపిచ్చు కోని వస్తుంటిమి.